ఉపాధి నైపుణ్యంపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉన్నతి స్కిల్ సెంటర్ (బెంగళూరు) స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భద్రగిరి ఆర్ ఐటిఐలో నవంబర్ 17నుంచి డిసెంబర్ 23 వరకు ఉపాధి నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ పై బి.విజయ్ కుమార్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను ఇంటర్నెట్‌లో డౌన్లోడ్ చేసుకోవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు; కలెక్టరేట వద్ద దర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించేంత వరకూ ఆందోళన

- కలెక్టరేట్, ప్రాజెక్టు కార్యాలయాల వద్ద అంగన్‌వాడీల ఆందోళన
- నిలిచిన సేవలు
- సిపిఎం, టిడిపి, ప్రజాసంఘాల సంఘీభావం

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సమ్మెబాట పట్టారు. తెలంగాణాలో కంటే ఎక్కువ వేతనం ఇస్తామని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫేస్‌యాప్ విధానం రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, తదితర డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సమ్మెకు దిగారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద మంగళవారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన దీక్షలు చేపట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ సేవలు నిలిచిపోయాయి. ఈ సమ్మెకు టిడిపి, సిపిఎం, సిఐటియు, పలు ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపాయి.

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

దీర్ఘకాలంగా అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి అధ్యక్షతన నిరవధిక సమ్మెదీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ దేశానికి బలమైన భావి పౌరులను అందించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే అపురూపమైన వ్యవస్థ అంగన్వాడీ అని అటువంటి వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అనుగుణంగా మార్చుకుని నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా అనేక రకాలుగా ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం రాలేదని విమర్శించారు. న్యాయమైన వీరు డిమాండ్లు పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పార్టీలకు అతీతంగా రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. తొలుత యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలను తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లపెంచాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, భీమా అమలు చేయాలని, 2017 టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్టార్ లీడర్లు ఎం.గౌరి, కె.రాజేశ్వరి, బి.శాంతి, పార్వతమ్మ, ధర్మవతి నీలవేణి, రాజేశ్వరి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమ్మెకు టిడిపి, ప్రజాసంఘాల నాయకులు మద్దతు

తమ సమస్యల సాధనకు కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవదిక సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల సంఘం జిల్లా కార్యదర్శి మన్నంగి హరినాథ్, పార్వతీపురం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు బంకూరు సూరిబాబు తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

బలిజిపేట : స్థానిక మెయిన్‌రోడ్ పక్కన అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ నిరసనుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.దాదమ్మ, ఇందిర, సావిత్రి, స్వర్ణ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్‌వాడీల హక్కులు సాధించే వరకు నిరవధిక సమ్మెను సాగిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర స్పష్టం చేశారు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టే నిరవధిక సమ్మెకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళా కుమారి, జిల్లా కార్యదర్శి జె.సరోజ, రెండు మండలాల అంగన్‌వాడీల సెక్టార్ లీడర్లు, కార్యకర్తలు, ఆయాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సాలూరు : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మున్సిపల్ కార్యాలయం ముందు జాతీయ రహదారి పక్కన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు బి.రాధ, కార్యదర్శి వరలక్ష్మి, మండల కమిటీ అధ్యక్షులు ఎ.నారాయణమ్మ, కార్యదర్శి శశికళ, నాయకులు తిరుపతమ్మ,పార్వతి పాల్గొన్నారు.

మక్కువ : స్థానిక ప్రధాన రహదారి అనుసరించి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు ప్రభుత్వం తమను సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.దాలమ్మ, వై.పద్మ, వి.సుశీల, వి.గౌరి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని కేంద్రాల వర్కర్లు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెన్నెల రామలక్ష్మి, మరడ సత్యవతి, సెక్టార్ నాయకులు శైలజ, సునీత, రెడ్డి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ సంఘీభావం తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : సమస్యల పరిష్కారం కోరుతూ భద్రగిరి ఐసిడిఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు గుమ్మలక్ష్మీపురంలో నిరవధిక సమ్మె చేపట్టారు. అంగన్వాడీల సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం కోశాధికారి, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, ట్రైబల్ రైట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు రోబ్బ లోవరాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు వై.కస్తూరి, సత్యవతి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సీతంపేట : అంగన్వాడీలు నిరవధిక సమ్మెలో భాగంగా తొలుత సీతంపేటలో నిరసన ర్యాలీ చేపట్టి, అనంతరం ఐటిడిఎ ముఖద్వారం వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరిక పార్వతి, ఆరిక దర్భమ్మి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలకు టిడిపి నాయకులు పడాల భూదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె కార్యక్రమం సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రభావతి ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ సేవలు ఎంత కష్టమైనా ఇబ్బందులు ఎదుర్కొని సేవలు అందిస్తున్న అంగన్వాడీలకు భద్రత లేని విధంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాదని ప్రభావతి అన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. వీరి సమ్మెకు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు సంఘీభావం తెలిపారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం సావిత్రి మాట్లాడారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సరస్వతి, కాత్యాయిని, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సిఐటియు) పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో పాలకొండలో అంగన్‌వాడీలు నిరసన ర్యాలీ ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హిమాప్రభ, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు జి.జెస్సీబాయి, బి.అమరవేణి, సెక్టార్ నాయకులు ఆర్.భవానీ, ఎన్.మణి, ఎన్.రాధ, ఎన్.లత, బి.వసుంధర, ధనలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

పాలకొండలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

బలిజిపేటలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, ఆయాలు

కురుపాంలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, ఆయాలు

సీతంపేటలో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు భూదేవి

జగనన్న దూకుడుపై సిట్టింగుల్లో గుబులు

- మన్యంలో సీట్ల గల్లంతుపై ఊహాగానాలు
- ఇద్దరికీ డౌటే!
- అంతర్గత సర్వేల ఆధారంగా అడుగులు

ప్రజాశక్తి - సాలూరు

'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకు వచ్చినట్టు' తెలంగాణ ఎన్నికల్లో అధికార బిఆర్ఎస్ ఓడిపోవడం రాష్ట్రంలో సిటింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తోంది. అక్కడ అధికార పార్టీ ఓటమి పాలవ్వడంతో ఎపిలో అధికారపార్టీ అప్రమ త్తమవుతోంది. ప్రజావ్యతిరేకత ఎదుర్కొం టున్న ఎమ్మెల్యేలకు సీట్లు ఇచ్చిన కారణంగానే బిజెపి ఓడిపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వైసిపి నాయకత్వం కూడా ఇప్పటి నుంచే దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ పెనుమార్పులు ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల ఇంఛార్జి వైవి సుబ్బారెడ్డి వ్యాఖ్యలను పరిశీలిస్తే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా నియోజకవర్గ అభ్యర్థుల్లో మార్పులు, చేర్పులు ఉండొచ్చు నని తెలుస్తోంది. తెలంగాణా ఎన్నికల ముందు వరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు సిటింగ్ ఎమ్మెల్యేలందరికీ సీట్లు ఖరారయ్యాయనే ప్రచారం జరిగింది. అయితే తాజా పరిణామా లను బట్టి చూస్తే పార్వతీపురం మన్యం జిల్లాలోనూ పెనుమార్పులు వుండొచ్చు ననే వాదనలు తెరపైకి వస్తున్నాయి.

మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో మూడు ఎస్టీ, ఒకటి ఎస్సీలకు రిజర్వ్ చేయబడ్డాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొర సాలూరు నియోజకవర్గం నుంచి ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో ఓడిపోయినా కోర్టు తీర్పు ద్వారా 2006లో ఎన్నికయ్యారు. ఆ తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. అయితే రానున్న ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలతో కొంత విసుగు చెందిన ఆయన ఎంపీగా పోటీ చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

ఆయన అనుకున్నదే జరిగితే అసెంబ్లీ అభ్యర్థిగా కొత్త నేత వచ్చే అవకాశం ఉంది. పార్టీ అంతర్గత సర్వేల్లో కూడా ఆయనకు సానుకూల పరిస్థితులు లేవనే అభిప్రాయాన్ని కొంతమంది నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే లేదా ఎంపీల్లో ఏది ఇచ్చినా పోటీకి సిద్ధమేనని, అధిస్థానం నిర్ణయమే శిరోధార్యమని ఆయన చెపుతున్నారు. ఇక పార్వతీపురం ఎస్సీ నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు రెండోసారి పోటీకి సిద్ధంగా ఉన్నారు. ఆయన పట్ల పార్టీ శ్రేణుల్లో కొంత వ్యతిరేకత కనిపిస్తోంది. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎక్కువగా భూదందాలు, కబ్జాలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వీటి వెనుక ప్రధాన సూత్రధారి కీలక అధికారపార్టీ నాయకుడేననే చర్చ నడుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో సిటింగ్ ఎమ్మెల్యేకు సీటు దక్కడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి కూడా టికెట్ ఆశిస్తున్నారు. అధిష్టానం వీరిలో ఎవరికి టికెట్ ఇస్తుందా లేదా కొత్త వ్యక్తికి అవకాశం కల్పిస్తుందా అనేది తేలాల్సి ఉంది. కురుపాం నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిపై పార్టీలో వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ అంతర్గత సర్వేల్లోనూ ఆమెపై అనుకూల వాతావరణం లేదనే ప్రచారం జరుగుతోంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పని చేసిన సమయంలో ఆమెపై అవినీతి ఆరోపణలు కొంతవరకు వినిపించాయి. పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి విషయంలో కొంత సానుకూల దృక్పథం కనిపిస్తోందనే చర్చ నడుస్తోంది. ఆమె మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆమె ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కనుసన్నల్లోనే పాలన సాగిస్తున్నారు. మాజీ మంత్రి పుష్పశ్రీవాణి సోదరి పేరు ఇక్కడ తెరపైకి వస్తున్నప్పటికీ అంతిమంగా కళావతికే సీటు దక్కనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆశీస్సులు కూడా కళావతికే ఎక్కువగా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న నేపథ్యంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న దిద్దుబాటు చర్యలు ఎవరి కొంప ముంచుతాయోనని సిటింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు రేపుతోంది. ఈనెలాఖరుకల్లా అభ్యర్థులు ఎవరనేది స్పష్టత వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను మన్యం డిడి కె.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ ఏడాది పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిడితో పాటు ఉపాధ్యాయులు నారాయణరావు, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - సీతంపేట

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరావుకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సవర డొంబు, పాంగి శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘంగా భాషా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు అభినందనలు తెలిపారు.

సచివాలయ వ్యవస్థ పటిష్టతకే శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సచివాలయాల వ్యవస్థను పటిష్టపర్చేందుకు గానూ ఆ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ఐఆర్‌డి (పంచాయతీరాజ్ శాఖ) డైరెక్టర్ జె.మురళి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక వైటిసిలో సచివాలయాల సిబ్బంది, గ్రామ వాలంటీర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజల ప్రవర్తన తెలుసుకొని బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు. సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం ఈ శిక్షణను ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడికి అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో ఏమైనా సాంకేతిక లోపాలుంటే తమకు సమాచారం అందించాలన్నారు. రాష్ట్రంలో మొదటి విడతగా ఆరు ఐటిడిఎల పరిధిలో గల 43 మండలాల్లో 20వేల మంది గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణను అందిస్తున్నామని అన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమ విధుల నిర్వహణ, గోల్డ్ అచీవ్మెంట్ తదితర విషయాలపై పూర్తిగా అవగాహన కల్పించుకోవాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి టీం వర్క్ చేసుకొని విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు గ్రామ సచివాలయ సిబ్బంది వ్యక్తిగతంగా ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేలా మెడిటేషన్ (ధ్యానం)పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో హార్టిఫుల్ నెస్ మెడిటేషన్ ఇనిస్ట్యూట్ జోనల్ కోఆర్డినేటర్ (ఎన్జీవో) లక్ష్మణరావు, జిల్లా కోఆర్డినేటర్ జెవిఎస్ఎన్ రాజు, శిక్షకులు జె.సుధారాణి, ఇన్చార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న ఎపిఎస్ఐఆర్‌డి డైరెక్టర్ జె.మురళి

కురుపాం : ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని ఎపి ఎస్ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జె.మురళి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిడిఒ జి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న సచివాలయ సిబ్బంది వాలంటీర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామాల్లో సచివాలయ పరిధిలో గల ప్రజలకు సచివాలయ విధివిధానాలపై అవగాహన కల్పిస్తూ పథకాలు అందేలా చూసే బాధ్యత సిబ్బందేనన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : అర్హులకు ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా గ్రామ సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం ఐటిడిఎ పరిధిలోని మండలాల గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లకు గిరిమిత్ర భవనంలో నిర్వహిస్తున్న రిఫ్రెషర్ ట్రైనింగ్ కోర్స్‌లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కుల, మత వర్గ వర్ణ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందించాలన్నదే ప్రధాన లక్ష్యంగా చేసుకుని సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, వైస్ ఎంపిపిలు సిద్ధా జగన్నాధరావు, బంకురు రవికుమార్, సర్పంచ్ బంగారమ్మ, జెసిఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, సీనియర్ నాయకులు శేఖర్, ఎంపిడిఒ అకీబ్ జావేద్, కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

నాణ్యతతో కూడిన నిర్మాణ పనులను చేపట్టాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని టెకరికండి నుంచి భల్లుకోట వరకు, టి.కె.జమ్ము నుండి పల్లపుసిర్రి వరకు, పల్లపుసిరి నుండి నడిమి వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అలాగే కురుపాం మండలం జుంబ్రిరి నుండి కొత్తగూడ, నాయుడుగూడ గ్రామాల్లో బిటి రోడ్డు పనులను, భీంపురం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ నిర్మాణం జరుగుతున్న పనుల్లో నాణ్యతా లోపాల్లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

14నుంచి కలెక్టరేట్ వద్ద

ఆశా కార్యకర్తల వంటావార్పు

ప్రజాశక్తి - పార్వతీపురం
సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14,15 తేదీల్లో 36 గంటల పాటు కలెక్టరేట్ ముందు వంటా వార్పు నిర్వహిస్తూ నిరసన తెలియజేయనున్నట్టు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు శివాని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆశా కార్యకర్తలతో కలిసి మెడికల్ ఆఫీసర్ విద్యా మోహన్‌కు మంగళవారం వినతిని అందజేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, ఆశాల నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఎం.గౌరి, టి.పద్మావతి, పి.కొండ, జి.భాగ్యలక్ష్మి, ఎ.అరుణ, గంగా భాగ్యవతి, ఆర్ .దేవి, వై.దమయంతి, ఎం.పద్మ, వికె హేమలత, కె.జ్యోతి, లీలాశ్రీ, ఎస్.శాంతి, టి.కృష్ణవేణి, ఎ.శారద, వి.మాలతి, ఎం.గౌరీ, ఎం.సాయివల్లి పాల్గొన్నారు.

సాలూరురూరల్ : ఈనెల 14 ,15 తేదీల్లో ఆశా వర్కర్ల కలెక్టర్ ఆఫీసుల వద్ద తలపెట్టిన వంటా వార్పును జయప్రదం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మామిడిపల్లి, బాగువలస, తోణాం మెడికల్ ఆఫీసర్లకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకులు రాజేశ్వరి, త్రివేణి, ఆదిలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

పాచిపెంట : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల14, 15 రెండు రోజులపాటు కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లు తలపెట్టిన వంటావార్పు కార్యక్రమానికి ప్రజలంతా సంఘీభావం తెలపాలని యూనియన్ నాయకులు కె.చండీప్రియ, మంజుల, నిర్మల, నాగవేణి కోరారు. ఈమేరకు సిఐటియు నాయకులు భవాని, కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పాచిపెంట, గురువునాయుడుపేట పిహెచ్‌సిల వైద్యాధికారులు వెంకట్రావు, రవీంద్రబాబు వినతులు అందజేశారు.

వీరఘట్టం: సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14,15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు సెలవులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరికి ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

పాచిపెంట : పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

బలిజిపేట : ఈనెల 14 ,15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరగనున్న నిరవధిక ధర్నా చేపట్టనున్నట్టు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు బలిజిపేట, అరసాడ, గళావిల్లి వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేసింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు. జగదాంబ, కృష్ణవేణి, వీరమ్మ మాట్లాడారు.

కురుపాం : సమస్యల పరిష్కారానికై కలెక్టరేట్ వద్ద జరుగు 36 గంటల నిరసన ధర్నాలో ఆశా వర్కర్లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యాధికారులకు ఆశాలతో కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం శ్రీనివాసరావు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్
పట్టణంలోని బెలగాం చర్చి సెంటర్లో గల లూథరిన్ చర్చి సమావేశ మందిరంలో మంగళవారం పాస్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి సొంత నిధులతో సమకూర్చిన వస్త్రాలను దైవ సేవకులకు, సంఘ కాపరులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫాస్టర్ల ఫెలోషిప్ సభ్యులు, సంఘ కాపరులు, దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు

ముందస్తు ప్రణాళికలతో విద్యార్థులను చదివించాలి

ప్రజాశక్తి - కురుపాం
ముందస్తు ప్రణాళికను తయారుచేసి విద్యార్థులను చదివి శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఐటిడిఎ మానిటరింగ్ అధికారి బి.శ్రీనువాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద ఎంఇఒ ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కూల్ లీడర్ షిప్ కంపెటెన్సీస్, గ్రూప్ యాక్టివిటీస్, ఇండివిడ్యుల్ టాస్క్ , సిబిఎ, ఎన్ఎఎస్, ఎస్సీఇఎస్ పరీక్షలు యాక్షన్ ప్లాన్ కోసం అన్ని పాఠశాలలు సిద్ధం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంఇఒలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న 9వ వార్డుకు చెందిన లబ్ధిదారులు

రేషన్ పంపిణీ చేయాలని నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం
మండల కేంద్రమైన మర్రివీధికి సుమారు 40 మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలని టిడిపి నాయకులు బల్ల హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. తొమ్మిదో వార్డు పరిధిలోని గత రెండు నెలల నుంచి 40 మంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి తక్షణమే రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా రెండు రోజుల్లో రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని హరిబాబు తెలిపారు.

కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ఇంటి పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం
ఇంటి పన్నులు త్వరితగతిన వసూలు చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు చేయాలని, నూరు శాతం వసూళ్లు చేసి పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి దోహదపడాలని సూచించారు. అలాగే గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీటి, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. అలాగే సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని, లబ్ధిదారులకు కావాల్సిన సామాగ్రి అందజేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకీరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్
మండలంలో 2022-23గానూ 16వ విడత ఉపాధి హామీ చట్టంతో పాటు పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో డ్వామా పిడి రామచంద్రరావు అధ్యక్షతన ఎంపిపి మజ్జి శోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు నిర్వహించిన పనులపై జిల్లా రిసోర్స్ పర్సన్ జరిపిన ఆడిట్ పంచాయతీల వారీగా చదివి వినిపించారు. సాంకేతిక తప్పిదాలపై ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లను నిలదీశారు, ఎల్ఎన్ పురం, కృష్ణపల్లి, గోచెక్క, నర్సిపురంతో పాటు పలు గ్రామాలకు చెందిన క్షేత్రసహాయకులకు రికవరీలను విధిస్తూ సదరు రికవరీని వారితో పాటుగా గతంలో పనిచేసిన ఎపిఒ అలజంగి భానును కూడా బాధ్యులు చేయాలని డ్వామా పీడీ సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, ఇఒపిఆర్‌డి కృష్ణుడు, ఎపిఒ నాగలక్ష్మి, జెడ్‌పిటిసి రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి, వైస్ ఎంపిపిలు జగన్నాధరావు, బంకురు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివేదికను చదువుతున్న డిఆర్‌పి

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : డిఐఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
మారుమూల గిరిశిఖర గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగవారం ఆయన సందర్శించి అక్కడ నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఆశా కార్యకర్తలకు నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలు ఏ మేరకు అమలు చేస్తున్నారు, అందజేస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. సచివాలయాల వారీగా వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య సేవల ప్రగతి నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ మారుమూల మరియు గిరి శిఖర గ్రామాల్లో అవసరమైన మందులు, ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉంచి, వారికి తగు దిశా నిర్దేశనం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, అందుకు అవసరమైన శిక్షణ, పరిజ్ఞానంపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ర్యాపిడ్ టెస్టులు ద్వారా సికిల్‌సెల్ ఎనీమియా గుర్తించే పద్ధతులపై ప్రతి ఒక్కరూ శిక్షణ పొంది తెలుసుకోవాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం సేవలు హైరిస్కు, రక్త హీనత గర్భిణులకు వినియోగించాలన్నారు. అనంతరం ఆయన పిహెచ్‌సిలో లేబర్ రూం తనిఖీ చేసి కాన్పుల రికార్డు పరిశీలించారు. అలాగే వ్యాక్సిన్ నిల్వలు వాటి నిర్వహణ తనిఖీ చేశారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో ఆయన మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు స్థానికంగా ఉన్న గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను వైద్య సిబ్బందితో కలిసి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. రక్త హీనతగా గుర్తించిన విద్యార్థులకు ప్రతీ రోజూ ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. పరిశుభ్రత, రక్త హీనత, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.బుద్దేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్ రావు, సూపర్ వైజర్లు పద్మ, సింహాచలమమ్మ, రేరాయమ్మ, జయ గౌడ్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు,హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మాతృ మరణాల నివారణే ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని ఆర్‌బిఎస్‌కె జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ధవళ భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఆశాడే సందర్భంగా ఆశా కార్యకర్తలకు మాతా శిశు ఆరోగ్య, సంక్షేమంపై ప్రభుత్వం కొత్తగా తెచ్చిన యాప్ కోసం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్వైజర్లు, సిబ్బంది పర్యవేక్షణా లోపాల్లేకుండా పనిచేయాలని సూచించారు. మాతృమరణాల నివారణే ధ్యేయం కావాలన్నారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు అందించే సేవలపై ఆరా తీశారు.

గరుగుబిల్లి : సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

ఆశాలనుద్దేశించి మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

అలాగే ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కెకె సాగర్ వర్మ, వైద్య సిబ్బంది చింతాడ ఉదయకుమారి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : గ్రామాల్లోని గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలని స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలకు ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాల ద్వారా వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రసవ సమయంలో గర్భిణులను ప్రభుత్వాసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు టవళ్లు, అద్దాలు, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

617మందికి పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ
మండలంలోని ఇప్పటి వరకు 617 మంది డి పట్టా లబ్ధిదారులకు ఫ్రీ హోల్డ్ అందజేసినట్టు తహశీల్దార్ ఆవాల సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు 2వేలకు పైచిలుక లబ్ధిదారులు ఉన్నప్పటికీ ఇంకా కొన్ని జాబితాలు తయారు కావాల్సి ఉందన్నారు. 2003 సంవత్సరానికి ముందుగా డి పట్టా పొందిన లబ్ధిదారులకు ఈ ఏడాది ఫ్రీ హోల్డ్ అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీలో సుమారు 31 మంది లబ్ధిదారులకు అవకాశం ఉన్నప్పటికీ జాబితాలో చోటు కల్పించలేదన్న అంశాన్ని విలేకరులు ప్రశ్నించగా, ఇంకా జాబితాలో సిద్ధం కావాల్సి ఉందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మక్కువ
మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వైసిపి నాయకులు ఎం.రంగునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారీలను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ట్రక్ షీట్ తప్పనిసరిని, ఇ-ప్రొక్యూర్మెంట్ తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సూర్యనారాయణ, ఎఒ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్, పలువు రైతులు పాల్గొన్నారు.

జమదాలలో 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్
మండలంలోని జమదాలలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలతో కలిసి వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది రూపాయలతో అన్ని వర్గాలకు ప్రత్యక్షంగా అందేలా సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, పంచాయతీల అభివృద్ధికి లక్షలాది రూపాయలు వెచ్చిందన్నారు. సచివాలయం పరిధిలో ఇంత వరకూ రూ.22.50 కోట్లు మేర ప్రత్యక్షంగా, పరోక్షంగా, స్థానిక అభివృద్ధికి ప్రభుత్వం నిధులు వెచ్చించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపి బి.రవికుమార్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, స్థానిక మండల సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపిడిఒ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంగిపాడులో ఎపికి జగనే ఎందుకు కావాలి

సాలూరురూరల్ : మండలంలోని సంపంగిపాడులో వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, చంద్రయ్య, కురుకూటి ఎంపిటిసి సభ్యులు సుబ్బారావు, వైస్ సర్పంచ్ సాంబ, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ పైడితల్లి

ఆడుదాం ఆంధ్రకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి
ఆడుదాం ఆంధ్రకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపిడిఒ జి.పైడితల్లి పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే వారి కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రారంభమైందన్నారు. ఆయా సచివాలయాలకు వెళ్లి తమ పేర్లు నమోదు చేయించు కోవాలని కోరారు. ఈనెల 15 నుంచి 44 రోజుల పాటు ఐదుదశల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగుతాయన్నారు. మహిళలు, పురుషుల విభాగాల్లో ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 15 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, పోటీల్లో పాల్గొనదల చిన వారంతా తప్పనిసరిగా సచివాలయాల్లో తమపేర్లు నమోదు చేసుకోవలసి వుంటుందన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతా యన్నారు. సమావేశంలో కార్యాలయ ఎఒ నాలి అర్జునరావు, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎపిఒ గౌరీనాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలోని బాక్సింగ్ కోర్టులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, 17, 19 బాక్సింగ్ రాష్ట్ర పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండు బాక్సింగ్ రింగుల్లో జరుగుతున్న పోటీలు బుధవారంతో ముగియనున్నాయి. లీగ్ దశ పోటీలు మంగళవారంతో ముగిశాయి. బుధవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు మూడు విభాగాల్లో నిర్వహించనున్నారు. రెండో రోజు పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో క్రీడాకారులు, నగర ప్రజలు హాజరయ్యారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విజయనగరం టౌన్ : ధర్మపురిలో ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఆవిష్కరించారు. విగ్రహాన్ని ఏర్పాటుచేసిన సిరికి ఆ కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి సీతబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం
జిల్లాలో వికసిత భారత్ సంకల్ప యాత్ర ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు 150 గ్రామ పంచాయతీల్లో ఈ యాత్ర పూర్తయింది. యాత్రలో వైద్య శిబిరాలు నిర్వహించి సాధారణ వైద్య పరీక్షలు మాత్రమే కాకుండా క్షయ, సికిల్ సెల్ ఎనీమియా వంటి వాటిని గుర్తించుటకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 16,734 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 6446 మందికి క్షయ పరీక్షలు, 554 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. పిఎం ఉజ్వల్ యోజన కింద 1383 మంది నమోదు చేసుకున్నారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో గెలుపొందిన 589 మంది మహిళలకు, 340 మంది విద్యార్థులకు, 1296 మంది క్రీడాకారులకు, 89 మంది కళాకారులకు గ్రామ సభలలో భాగంగా సత్కరించారు. 120 డ్రోన్ ప్రదర్శనలు, 124 స్వయం సహాయక సంఘాల ప్రదర్శనలు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 135 మంది రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు జరిగాయి. అయుష్మాన్ కార్డులను 109 గ్రామ పంచాయతీలలో శత శాతం పంపిణీ చేశారు. 74 గ్రామ పంచాయితీల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినట్టు గుర్తించారు. 108 కి పైగా గ్రామ పంచాయితీలు ఓడిఎఫ్ ప్లస్ గాను, 71 గ్రామ పంచాయితీలలో శత శాతం భూమి రికార్డులు డిజిటల్ విధానంలో నమోదైనట్లు గుర్తించారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలను సంచార వాహనాల ద్వారా ప్రదర్శించడం, కళా బృందాల ద్వారా వివరించారు.

వికసిత భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారిగా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ జిల్లా, మండల అధికారులతో సమన్వయం చేస్తూ కార్యక్రమం పక్కాగా జరుగుటకు చర్యలు చేపడుతున్నారు. గ్రామ స్థాయిలో ముందుగానే షెడ్యూల్ ను తెలియజేస్తున్నామని, యాత్ర విశేషాలు తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నట్లు ఆయన చెప్పారు.

చలివేంద్రిలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి - వీరఘట్టం
మండలంలోని చలివేంద్రిలో మంగళవారం ప్రకృతి పండించిన పంటకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అమృతం ఆధ్వర్యంలో **5×5** విస్తీర్ణంలో పంటకోత ప్రయోగించగా 20 కిలోలు దిగుబడి వచ్చినట్లు ఆమె తెలిపారు. అలాగే రసాయన ఎరువులు ద్వారా పండించిన పంటకు **5×5** విస్తీర్ణంలో 13 1/2 కేజీలు కిలోలు దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులు వీటి తేడాను గుర్తించి ప్రకృతి సేంద్రియం ద్వారా పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. పొలం గట్లపై కూడా వివిధ రకాల పంటలు సాగు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డిపిఎం షణ్ముఖరావు, చంద్రబాబు, మండల యాంకర్ మారుతి సింహాచలం, విఎఎ సౌమ్య, మెంట్రో ఎ.మహేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

ప్రకృతి పంటలతో ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం
రసాయనిక ఎరువుల్లేని పంటలను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని సురక్షితంగా కాపాడుకోవచ్చని సర్పంచి బొత్తాడ గౌరీశంకర్ రావు అన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళ రైతులతో ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తే కాలుష్య వాతావరణం నివారించడానికి వీలుంటుందన్నారు. ప్రతి ఒక్క రైతు తనకున్న భూమిలో కొంత భాగం ప్రకృతి వ్యవసాయ పంటలు వేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం కో-ఆర్డినేటర్ కె.భూషణ్ మాట్లాడుతూ తక్కువ ఆదాయంతో ఎక్కువ దిగుబడి వచ్చే ప్రకృతి సాగుపై ప్రతి రైతు దృష్టి సారించాలని కోరారు. అప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ మండల టీం సభ్యులు గణేష్ చంద్ర, సరస్వతి, అరుణ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

పార్వతీపురంలో చోరీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్
పట్టణంలో దొంగతనాలు జోరు రోజురోజుకు పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే సోమవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి కత్తులతో బెదిరించి బంగారం నగదు దోచుకుపోయిన సంఘటన పట్టణంలో సంచలనం రేకెత్తించింది. డిఎస్‌పి మురళీధర్ అందించిన వివరాల ప్రకారం... పట్టణంలోని వైకెఎం కాలనీకి చెందిన ఎస్.రాణి గత కొన్నేళ్లుగా అపరాల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. ఆమె భర్త కూడా అదే వ్యాపారాన్ని వేరే ఊర్లో చేయడం వల్ల ఒంటరిగా ఉంటుంది. సోమవారం అర్ధరాత్రి రాణి ఇంట్లో ఇద్దరు వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఆమెకు కత్తి చూపించి బెదిరించి దొంగతనానికి పాల్పడ్డారు. 14 తులాల బంగారం, రూ.70 వేలు నగదు దొంగతనానికి గురైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ జరిపి అతి త్వరలోనే దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

చోరీ వివరాలను తెలుసుకుంటున్న డిఎస్‌పి

పెంకుటిల్లు దగ్ధం

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురంలో మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధమైంది. గ్రామంలోని పెద్ద వీధికి చెందిన మాచర్ల శ్రీరామ్ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఫ్రిడ్జ్, టీవీల నుంచి మంటలు చెలరేగడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీనికి తోడు ఇటీవల దీపావళి పండగకు తీసుకువచ్చిన మతాబులు కాల్చగా మిగిలిపోయినవి అటుకుపై పెట్టడంతో ప్రమాదం మరింత ఎక్కువగా జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువస్తున్నారు.